ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 31 మార్చి 2025

కోదండరామాలయంలో
ఘనంగా ఉగాది వేడుకలు



కోదండరాముడికి పూజలు చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కోదండ రామాలయంలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువజామునే ఆలయ అర్చకులు పవన్‌కుమార్, శ్రావణ్‌కుమార్‌లు స్వామివారికి అభిషేకం చేసి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి సీతారామ లక్ష్మణులను దర్శించుకున్నారు. ఉదయం 9 గంటలకు ఆస్థాన పురోహితులు ఏలేశ్వరం గురుస్వామి పంచాంగ శ్రవణం చేశారు. సాయంత్రం సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

చికెన్ వేస్టేజీలోను
చిలకొట్టుడు



ఇటీవల అధికారులు చికెన్ వేస్టేజీ వాహనాలను పట్టుకుని కార్పొరేషన్ వద్ద ఉంచిన దృశ్యం (ఫైల్)

- కార్పొరేషన్ ఆదాయానికి గండి
- అధికారులు, నేతల జేబుల్లోకి దండిగా...

కడప, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ అధికారులు అడ్డగోలుగా కార్పొరేషన్ ఖజానాకు గండికొట్టి ఆ సొమ్ముతో జేబులను నింపుకోవడంలో సిద్ధహస్తులుగా మారారు. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్లుగా అక్రమంగా సంపాదించే వక్రమార్గాలన్నీ ఇక్కడి అధికారులకే సాధ్యం. గాలికి అగ్గి తోడు అయినట్లుగా అవినీతి అధికారులకు అధికారం కూడా తోడు కావడంతో నిధులను దోచేసుకుంటుండడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది.

కడప కార్పొరేషన్ పరిధిలో సుమారు 250 వరకు చికెన్, మటన్ దుకాణాలు ఉన్నాయి. ఒక్కో కోడి నుంచి దాదాపు 450 గ్రాములకు పైగా వ్యర్థాలు వస్తుంటాయి. అయితే నిర్వాహకులు వాటిని ఎక్కడపడితే అక్కడ పారేస్తుంటారు. ఇది అనారోగ్యాలకు దారి తీస్తుంది. దీంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చికెన్ వేస్టేజీని ఆక్వా పరిశ్రమలకు తరలించేందుకు గతంలో ఓ కాంట్రాక్టర్ ఏడాదికి రూ.20 లక్షలకు టెండర్‌ను కట్టబెట్టారు. అయితే అతను మరొకరికి సబ్‌కాంట్రాక్టర్‌కు ఇచ్చి కార్పొరేషన్‌కు పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించలేదు. ఈ విషయంపై గతంలో ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. గడువు పూర్తయినా ఆ కాంట్రాక్ట్‌ను రెన్యువల్ చేయలేదు, మళ్లీ టెండర్ పిలవలేదు. టెండర్ నిర్వహించి ఉంటే రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలకు పైగా కార్పొరేషన్‌కు ఆదాయం వచ్చేది.

సొంత జేబుల్లోకి...

చికెన్ వేస్టేజీకి టెండర్ వేస్తే కార్పొరేషన్‌కు డబ్బు వెళుతుంది. టెండర్ పిలవకుండా కొందరు అధికారులు, అధికార పార్టీ నేతలు వేస్టేజీని తరలించే వారితో అనధికారికంగా ఒప్పందం కుదుర్చుకుని నెలనెలా మామూళ్లు తీసుకుంటున్నట్లు తెలిసింది. అయితే అన్ని చోట్లా చికెన్ వేస్టేజీ తీసుకోకుండా పెద్దపెద్ద షాపుల్లో సేకరించి వాటిని నెల్లూరు ఆక్వా, నంద్యాలలో పందులకు విక్రయిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. వచ్చిన డబ్బును ఓ అధికారి, అధికార పార్టీకి చెందిన ముగ్గురు నేతలు పంచుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల వేస్టేజి వాహనాలను ఊరి బయట నిలిపి నగరం నుంచి ఆటోల ద్వారా డ్రమ్ముల్లో తీసుకెళ్లి అక్కడే లోడ్ చేసుకుంటుండగా ఆ వాహనాలను కార్పొరేషన్ అధికారులు పట్టుకుని వాటిని తీసుకొచ్చి కార్పొరేషన్‌లో అప్పచెప్పగా అధికారులు వాటిని ఆఘమేఘాల మీద వదిలేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఎక్కడపడితే అక్కడే...

అనధికారికంగా చికెన్ వేస్టేజీని కలెక్ట్ చేస్తున్న బ్యాచ్‌ను అన్ని చోట్లకు వెళ్లి సేకరిస్తే గిట్టుబాటు అవుతుందనే భయంతో ప్రధాన చోట్లనే కలెక్ట్ చేస్తుండడంతో చిన్నచిన్న అంగళ్ల వాళ్లు చికెన్ వేస్టేజీని బుగ్గవంకలో వేసేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతూ అనారోగ్యానికి కారణమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయమై కార్పొరేషన్ ఎంహెచ్‌వో చంద్రశేఖర్‌ను వివరణ కోరగా చికెన్ వేస్టేజీకి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలుస్తామని తెలిపారు.

జిల్లావాసులకు
ఉగాది పురస్కారాలు



విజయవాడలో జరిగిన ఉగాది వేడుకల్లో హనుమంతరావు, పందిటి కృష్ణమూర్తి, వేంపల్లె షరీఫ్‌కు అవార్డులు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

14 మంది సీఐల బదిలీ

కడప క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమ 4వ జోన్‌లో పనిచేస్తున్న సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు వారికి కేటాయించిన స్టేషన్లలో బాధ్యతలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

సీఐ	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రాంతం
యు.సదాశివయ్య	పీటీసీ తిరుపతి	ప్రొద్దుటూరు టూటౌన్
యుగంధర్	ప్రొద్దుటూరు టూటౌన్	ఆళ్లగడ్డ
యల్లమరాజు	వీఆర్ అన్నమయ్య	మహిళా పోలీసుస్టేషన్, కడప
క్రిష్ణారెడ్డి	మహిళా పోలీసుస్టేషన్, కడప	చెన్నూరు
పురుషోత్తంరాజు	చెన్నూరు ఎస్‌బీ-1,	కడప
పి.రెడ్డెప్ప	ఎస్‌బీ 1, కడప	సీసీఎస్-2
చాంద్‌బాషా	సీసీఎస్2, కడప	పులివెందుల
నరసింహులు	పులివెందుల	వేంపల్లె
సురేశ్‌రెడ్డి	వేంపల్లె	వీఆర్,కడప
ఈశ్వర్‌రెడ్డి	వీఆర్, కడప	డీసీఆర్‌బీ, కడప
వెంకటకుమార్	డీసీఆర్‌బి, కడప	వీఆర్ కడప
క్రిష్ణమరాజు	వీఆర్, కడప	సీసీఎస్1, కడప
భాస్కర్‌రెడ్డి	సీసీఎస్1, కడప	వీఆర్, కడప
శ్రీహరి	వీఆర్, కర్నూలు	మైదుకూరు

పోలీసు కార్యాలయంలో
ఉగాది వేడుకలు

- సంప్రదాయ దుస్తుల్లో ఎస్పీ, సిబ్బంది



సిబ్బందికి ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఉగాది ప్రత్యేక పూజల్లో ఎస్పీ అశోక్‌కుమార్ పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి పూజల్లో పాల్గొని సిబ్బందికి ఉగాది పచ్చడి, మిఠాయిలు అందించారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉత్సాహభరిత వాతావరణంలో ఉగాది సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, సిబ్బందికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఆర్‌ఐలు ఆనంద్, వీరేశ్, శ్రీశైల రెడ్డి, శివరాముడు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడే రంజాన్

- ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గాలు



ప్రార్థనలకు సిద్ధమైన కడపలోని బిల్టప్ ఈద్గా

కడప (కల్చరల్), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కఠిన ఉపవాసాలతో 30 రోజులు గడిపిన ముస్లింలు రంజాన్ మాసం ముగింపు సంకేతంగా సోమవారం ఈతుల్ ఫిత్ర్ (రంజాన్) పండుగ జరుపుకోనున్నారు. ఆదివారం నెలవంక కనిపించడంతో సోమవారం రంజాన్ పండుగను జిల్లాలో ఘనంగా జరుపుకోనున్నారు. నగరంలోని బిల్టప్ సమీపంలో గల ఈద్గా మైదానాన్ని ప్రార్థనలకు సిద్ధం చేశారు. నగరంలోని వస్త్ర, బంగారు దుకాణాలు, మెహందీ, తదితర అన్ని రకాల దుకాణాలు కళకళలాడాయి.



వైవీ స్ట్రీట్‌లో దుస్తులు కొనుగోలు చేస్తున్న దృశ్యం



గాజులు కొనుగోలు చేస్తూ...

ప్రజలు సుఖసంతోషాలతో గడపాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి
- ఘనంగా ఉగాది వేడుకలు



సొట్టు సాంబమూర్తికి ఉగాది పురస్కారం అందచేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

కడప (కలెక్టరేట్), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ విశ్వావసు నామ ఉగాది తెలుగు నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో గడపాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్వాన్ సొట్టు సాంబమూర్తి పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తో పాటు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాసులు సంప్రదాయ వస్త్రధారణతో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పల్లె సీమలు, పశు సంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాక్షించారు.

నలుగురు పండితులకు ఉగాది పురస్కారాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది సనాతన ధర్మానికి విశేష సేవలు చేసిన వేద పండితులు, అర్చకులకు, కవులకు అందించే ఉగాది పురస్కారాలు జిల్లాలో నలుగురికి వరించాయి. ప్రొద్దుటూరుకు చెందిన శ్రీనివాసాచార్యులు, పులివెందులకు చెందిన కలుబండి రాంకుమార్‌శర్మ, కడపకు చెందిన గోపాలకృష్ణశర్మ, సొట్టు సాంబమూర్తిలకు దేవదాయ శాఖ ద్వారా ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికి రూ.10,116 నగదు, ప్రశంసాపత్రాలను కలెక్టర్, ఎమ్మెల్యేలు అందచేశారు. అనంతరం ఉత్తమ అర్చకులు ఎస్.నరసింహభట్టర్, చంద్రమౌళిశర్మ, ఎన్.శశిధర్‌తలకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉగాది వేడుకల్లో భాగంగా ముద్ర అకాడమీ, లహరీ బృందం చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. అనంతరం కలెక్టర్ వారిని సత్కరించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూల మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన కవి కమ్మేళనం జరిగింది. అనంతరం ఉగాది పచ్చడిని అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ మల్లి కార్జునప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, పర్యాటక శాఖాధికారి సురేశ్, వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు, కలెక్టరేట్ ఏవో విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

అమ్మవారికి ముస్లింల
పుట్టింటి సారె

- దేవుని కడపలో వైభవంగా ఉగాది వేడుకలు



దేవుని కడప ఆలయంలో టెంకాయలు కొడుతున్న ముస్లింలు



ఆలయంలోకి వస్తున్న ముస్లిం మహిళలు



దర్శనానికి క్యూలో వెళుతున్న ముస్లిం మహిళలు

కడప కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను ఆదివారం జిల్లా ప్రజలు అత్యంత ఆనందకరంగా జరుపుకున్నారు. పలు ఆలయాలలో వేదోక్తంగా పంచాంగ శ్రవణం చేసి ఉగాది పచ్చడి పంచిపెట్టారు. దేవుని కడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. తిరుమలేశుని దివ్యరూప దర్శనం కన్నులారా తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకోవడంతో సందడి నెలకొంది. ఆనవాయితీగా ముస్లిం మహిళలు బీబీ నాంచారమ్మ అమ్మవారికి పుట్టింటి సారెను తీసుకొచ్చారు. ఆలయానికి పలువురు ముస్లిం మహిళలు చేరుకుని క్యూలో నిల్చుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం అమ్మవారికి పుట్టింటి సారె సమర్పించారు.



స్వామి వారి పాదాలకు పూలు వేసి నమస్కరిస్తున్న ముస్లిం మహిళ

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న పీఠాధిపతి విరజానందస్వామి

- శోభాయాత్రలో విరజానందస్వామి

బ్రహ్మంగారిమఠం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగ సందర్భంగా బ్రహ్మంగారిమఠం మండలంలోని అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి అధ్యక్షతనన అచలానంద ఆశ్రమం నుంచి ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా పెద్దఎత్తున భక్తులతో శోభాయాత్రగా వెళ్లి బ్రహ్మంగారిని దర్శించుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామ ప్రజలు, భక్తులు ఆధ్వర్యంలో శోభాయాత్రలో భాగంగా కాషాయరంగుల జెండాలతో జై శ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ శోభాయాత్రగా వెళ్లి పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. శోభాయాత్ర వెంట మహిళలు చిన్నారుల చేత కోలాటం చేపట్టారు. శోభాయాత్ర గ్రామ గ్రామాన ప్రజలు నీరాజనం పలికారు. భక్తులందరూ ఉత్సాహంగా తమ భక్తిని చాటుకున్నారు.

వైభవంగా పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రియశిష్యుడైన సిద్దయ్యస్వామి కుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు ఆదివారం ఉగాది పండుగ పర్వదిన సందర్భంగా ఘనంగా నిర్వహించారు. దేవస్థానం పీఠాధిపతి కలుగొట్ల సిద్దయ్య ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం 5 గంటల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం పెద్ద, చిన్న వృషభరాజముల బండలాగుడు పోటీలుంటాయని పీఠాధిపతి కలుగొట్ల సిద్దయ్య తెలిపారు.



విద్యుత్ అలంకరణలో సిద్దయ్యమఠం దేవస్థానం



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, భక్తులు



ఎక్స్‌రే యంత్రం

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రి

● రైల్వేకోడూరు ఆస్పత్రికి అధునాతన పరికరాలు ● త్వరలో రోగులకు అందుబాటులోకి..

రైల్వేకోడూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. రైల్వేకోడూరు ప్రభుత్వ పాత ఆస్పత్రి అలానే ఉంచిన ప్రభుత్వం ఏడాది క్రితం సుమారు రూ. 12 కోట్లతో 50 పడకల ఆస్పత్రి నిర్మించింది. ఇందులో మొదట రక్త పరీక్షలు చేసే పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వైద్యవిధానపరిషత్ వారు పుల్లీ ఆగో అనలైజర్ (వివిధ రకాల పరీక్షలు చేసే యంత్రం) పంపారు. ఇందుకోసం ఒక కంప్యూటర్‌తో పాటు వాటర్ ఫిల్టర్స్ పంపారు. వీటిని ల్యాబ్‌లో అమర్చారు. టెక్నీషియన్ వచ్చి ఇన్‌స్టాల్ చేయాల్సి ఉంది. ఈ పరికరంతో 300 రకాల పరీక్షలు చేయవచ్చు. కిడ్నీ పరీక్షలు చేసే విధంగా అధునాతన యంత్రం అందుబాటులోకి వస్తోంది. ఎక్స్‌రే మిషన్ వచ్చింది. దీని సీఆమ్ అనే పరికరం రావాల్సి ఉంది. కొన్ని రోజుల్లో ఇవి రోగులకు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో శవపరీక్ష గది కూడా ఏర్పాటు చేశారు. క్యాంటీన్, సెక్యూరిటీ తదితరాలు నిర్మించారు. ఆస్పత్రికి రోజుకు 300 మందికి పైగా రోగులు వస్తుంటారు. అన్నిరకాల మందులు రోగులకు అందుబాటులో ఉన్నాయి. కుక్క, పాము కాటుకు కూడా మందులు రోగులకు అందుబాటులో ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. గుండె పోటుకు గురైన వారిని కాపాడడానికి రూ. 40 వేలు విలువ చేసే ఇంజక్షన్ ఆస్పత్రిలో సిద్ధంగా ఉంటుందని వైద్యులు తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వేలకువేలు పోగొట్టుకోకుండా, ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రిలో ని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు అంటున్నారు.



రైల్వేకోడూరు ఆస్పత్రికి చేరిన అధునాతన యంత్రం

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం



ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం రోగులకు అందుతోంది. అన్ని రకాల మందులు ఉన్నాయి. ఎక్కడ లోపాలు లేకుండా చేస్తున్నాం. ఎక్కడ సమస్యలు లేకుండా చేస్తున్నాం. గుండె పోటుకు గురైన వారికి అత్యవసరంగా ప్రాణాలను కాపాడానికి రూ.40 వేలు విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగా వేస్తాం.

- బ్రహ్మకుమారి, ప్రధాన వైద్యురాలు

అనేక జబ్బులు గుర్తించవచ్చు



అధునాతన పరికరాలతో అనేక జబ్బులను గుర్తించ వచ్చు. ఇప్పటికే అనేక కొత్త పరికరాలు వచ్చాయి. వీటిని త్వరలో అందుబాటులోకి తీసుకుని వస్తాము. ప్రైవేటు ఆస్పత్రిలో వేలకు వేలు ఖర్చయ్యే పరీక్షలు, ఇక్కడ ఉచితంగా చేస్తున్నాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- అబ్దుల్ రషీద్, ల్యాబ్ టెక్నీషియన్

సంస్కృతి సంప్రదాయాలే మన వారసత్వ సంపద

కడప ఎడ్యుకేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు నిలయమని, అదే మన నిజమైన వారసత్వ సంపదని తిరుమల - తిరుపతి దేవస్థానాల వైదిక యూనివర్సిటీ డీన్ డాక్టర్ రాజేష్‌భట్టర్ అన్నారు. ఆదివారం కడప నగరం మానస సమావేశ మందిరంలో భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటెక్) ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు విజయ్ భట్టర్ పంచాంగ పఠనం చేశారు. ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు ఎ. వెంకటసుబ్బయ్య, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, పోతుల వెంకటరామిరెడ్డి తో పాటు ఆ సంస్థల సభ్యులు వేద పండితులను ఘనంగా సత్కరించారు. అనం తరం సంస్థ పురోభివృద్ధిలో తోడ్పాటునందిస్తున్న సభ్యులందరినీ పోతుల ట్రస్టు ఆధ్వ ర్యంలో ఘనంగా సత్కరించారు. జ్ఞాపిక లను అందజేశారు.

అంకాలమ్మ ఆలయానికి వెండి ముఖ కవచాలు అందజేత

పులివెందుల , మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది సందర్భంగా స్థానిక అంకాలమ్మ ఆలయం లోని అమ్మవార్లకు పల్లె వెంకట అశోక్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు, మిట్ట మల్లికార్జునశెట్టి కుటుంబ సభ్యులు మిట్ట కరుణాకర్, మిట్ట మంజునాథ్, గండి దేవస్థాన ఏఈ నిఖిల్ కుటుంబ సభ్యులు సంయుక్తంగా మూడు కిలోల వెండి కవచాలను సమర్పించారు. ఆలయ ఛైర్మన్ నాగేంద్ర ప్రసాద్, ఈవో కేవీ రమణలకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సురేశ్ దాతలతో కలిసి మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ అమ్మవారి వెండి కవచాలతో ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవార్లకు అలంకరిం చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.



వెండి కవచాలతో ప్రదక్షిణ చేస్తున్న దాతలు

రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

రాయచోటిటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆదివారం అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. భూములు, స్థలాలు రిజిస్టర్ చేసే ముందు ఒకటికి రెండు సార్లు పరిశీలించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసులు

ఇద్దరు సీఎంలున్నా నీటి సమస్య పట్టించుకోలేదు

● ఏప్రిల్ 15 నాటికి పరిష్కారం

● వేంపల్లెలో బోర్లను ప్రారంభించిన బీటెక్ రవి

వేంపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రాంతంలో ఇద్దరు ముఖ్యమంత్రులు పని చేశారని, పాడా పథకం కింద వేల కోట్లు ఖర్చు చేశారని, అయినా పులివెందుల నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీరలేదని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీ, పులివెందుల రోడ్డులోని శ్లోకస్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన బోర్లను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లెలో తాగు నీటి సమస్య పరిష్కారానికి ఎక్కడ అవసరమైతే అక్కడ బోర్లు వేయాలని స్థానిక అధికారులకు, నాయకులకు సూచించారు. గతంలో ముఖ్యమంత్రులుగా పని చేసి వైఎస్ జగన్, ఆయన తండ్రి ప్రజల సమస్యలు, ముఖ్యంగా తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టలేదన్నారు. జల్ జీవన్ కింద ఏప్రిల్ 15 నాటికి చక్రాయపేట మండలం మినహా మిగిలిన మండలాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి,మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మండల కన్వీనర్ మునిరెడ్డి, యువ నాయకులు నామా వేమకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, మైనార్టీ నాయకులు షరీఫ్, తెలంగాణ వలి, మడక శ్రీనివాసులు, ఎద్దుల శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, టీడీపీ నాయకులు

మూడేళ్లలో హత్య కేసు పరిష్కారం

● రాచమల్లు రాజీనామా చేస్తాడా ?

వేంపలె : ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు రెండు మూడేళ్లలో కోర్టు తేల్చే అవకాశం ఉందని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివేకా హత్య కేసులో అవినాశ్‌రెడ్డి ప్రమేయం ఉందని తెలిస్తే ఎమ్మెల్యేలమంతా మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని గతంలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చెప్పాడని గుర్తు చేశారు. కేసులో ప్రమేయం ఉన్నట్లు అవినాశ్‌రెడ్డిపై కేసు నమోదైనా రాజీనామా చేయలేదని, కేసు నిరూపితమై జైలుశిక్ష పడితే రాజీనామా చేస్తానని శివప్రసాద్ చెప్పినపుడు అభ్యంతరం చెప్పి, అపుడు మీరు ఎక్కడుంటారో ఎవరికి తెలుసునని, కేసు నమోదైతే రాజీనామా చేస్తావా? అని ప్రశ్నించానని బీటెక్ రవి అన్నారు. సునీల్‌యాదవ్ ఇటీవల ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో వాస్తవం ఉన్నట్లుందన్నారు. అందరి పాత్రలు ఆ సినిమాలో లేవని ఆయన చెప్పారని, కొన్ని పాత్రలనే పెట్టడం, మిగతావారి ప్రమేయం లేదంటూ సునీల్‌యాదవ్ చెప్పింది వాస్తవమేనన్నారు. హత్య కేసుకు సంబంధించి ఇటీవల జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో కేసు త్వరగా తేలుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటమితో రాచమల్లుకు మతి పోయింది

ప్రొద్దుటూరు , మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఓటమిని జీర్ణించుకోలేక మతి చెడిపోవడంతోనే వైసీపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యే వరద రాజులరెడ్డిపై అవాకులు చవాకులు మాట్లాడుతున్నాడని టీడీపీ నాయకుడు రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆరోపించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోపవరం ఉపసర్పంచ్ ఎన్నికల కోసం వరదరాజులరెడ్డి రభస చేశాడని మాట్లాడుతున్నావు. గతంలో నీ పార్టీలో ఉన్న శివచంద్రారెడ్డి కొడుకు మత్స్య కాలనీకి వార్డు మెంబరుగా పోటీ చేస్తే నీవెందుకు పోటీ నిలబెట్టి కోట్లు ఖర్చు పెట్టి ఓటమి పాలయ్యావని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉండి కేవలం ఒక వార్డు మెంబరుకు పోటీ ఎందుకు పెట్టించి ఓడిపోయావన్నారు. బీసీలకు ఉప సర్పంచ్ పదవి ఇస్తానని చెప్పి మోసం చేశావు కాబట్టి బీసీలకు న్యాయం చేయడం కోసం వరదరాజులరెడ్డి గోపవరం ఉపసర్పంచు ఎన్నికల్లో జోక్యం చేసుకున్నాడన్నారు. టీడీపీ బీసీ నాయకుడు పగిడాల దస్తగిరి మాట్లాడుతూ రాచమల్లు ప్రసాద్ రెడ్డి వార్డు మెంబర్లకు రూ.10 లక్షలు డబ్బు, మూడు సెంట్ల స్థలం ఇస్తానని చెప్పి మాట తప్పాడన్నారు. ఓట్లేసి రండి.. డబ్బులు ఇస్తానని చెప్పి.. ఆయన బంధువైన ఎన్నికల అధికారి రామాంజనేయుల రెడ్డికి చెప్పి వాయిదా వేయించాడన్నారు. పెద్దాయనతో పోరాడే ముందు తమతో ఢీకొనాలని సవాల్ విసిరారు. ప్రాణ భయంతోనే నేటికీ ఇంటి చుట్టూ కరెంట్ పెట్టుకున్నాడని విమర్శిం చారు. నాడు ప్రవీణ్ రెడ్డిపై దాడి చేసి.. అతే మంచి వాడంటాడ న్నారు. లింగారెడ్డిని అవమానించిన ఆయన నేడు లింగారెడ్డిని పొగుడుతున్నాడ న్నారు. ఆయన జిత్తుల మారి వైఖరిని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, రామకృష్ణ , కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ ఎస్ఐ శంకర్, పగిడాల దస్తగిరి

ముంబై ఐఐటీలో తెలుగుతేజం

రాయచోటిటౌన్, మార్చి30(ఆంధ్రజ్యోతి): ముంబై గడ్డ తెలుగోడి అడ్డా అని నిరూపించాడు మురికినాటి సాయిదివ్యతేజరెడ్డి. రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెకు చెందిన మురికినాటి శ్రీనివాసులరెడ్డి కుమారుడు సాయిదివ్యతేజరెడ్డి ముంబై ఐఐటీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆ విద్యాసంస్థలో జరిగిన యూజీ సోషల్ సెక్రటరీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి తెలుగువారి సత్తా చాటాడు. ఐఐటీ బొంబాయి చరిత్రలో మొట్టమొదటి సారిగా ఒక తెలుగువాడు ఎన్నిక కావడం గర్వకారణం. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన సాయిదివ్యతేజరెడ్డికి ప్రముఖుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



సాయి దివ్యతేజరెడ్డి

మామిడి తోటకు నిప్పు

గాలివీడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): అకతాయిలు నిప్పు పెట్టడంతో మామిడి చెట్లు, డ్రిప్పు పైపులు దగ్ధమయ్యాయి. గోపనపల్లె పంచాయతీ సిద్దవాండ్లపల్లె నివాసి వెంకట్రమణకు చెందిన 8 ఎకరాల మామిడి తోటకు ఆదివారం ఆకతాయిలు నిప్పంటించారు. దీంతో 30 మామిడి , 5 కొబ్బరి చెట్లు , 10 నేరేడు చెట్లతో పాటు 5 పైపులు, 50 మీటర్ల మోటారు వైరు , స్టార్టర్, 10 మీటర్ల కేబుల్ వైరు కాలిపోయాయని బాధితుడు తెలిపాడు. సమాచారం అందుకుని తాము వెళ్లేలోగా ఇవన్నీ కాలిపోగా, మిగిలినవాటిని కాపాడుకున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఏదైనా సహాయం చేయాలని వారు కోరారు.




కాలిపోయిన మామిడి చెట్లు

చికిత్స పొందుతూ మహిళ మృతి

కడప క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అక్కాయపల్లెలో నివాసం ఉంటున్న ఓ మహిళ కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం బండపల్లికి చెందిన వడ్డె లక్ష్మీదేవి (32) భర్త రాముడు ఒకటిన్నర సంవత్సరం క్రితం జీవనోపాధి కోసం కడపకు వచ్చారు. అక్కాయపల్లెలో ఇల్లు అద్దెకు తీసుకుని పనులకు వెళుతుండేవారు. ఏడాది క్రితం నుండి ఆమె కడుపు నొప్పితో బాధపడుతుండేదని, శనివారం రాత్రి కడుపునొప్పి రావడంతో భర్త ట్యాబ్లెట్ల కోసం బయటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆమె తలకు పూసుకునే రంగు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తిరిగి వచ్చిన భర్త ఇది గమనించి రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

తాటివనంలో అగ్ని ప్రమాదం

కమలాపురం రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు నిప్పం టించడంతో ఆదివారం రాత్రి మం డలంలోని రామచంద్రపురం సమీ ప ఫారెస్టు ఏరియా తాటివనంలో మంటలు ఎగసిపడుతున్నాయి స్థా నికులు ఫైర్‌స్టేషనుకు సమాచారం ఇవ్వగా ఫైర్‌ఇంజను అందుబాటు లో లేనట్లు తెలిసింది.



తాటివనంలో ఎగసిపడుతున్న మంటలు

బస్సు ఢీకొనడంతో ఒకరికి గాయాలు

సిద్దవటం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు ప్రదీప్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి ఆదివారం సాయంత్రం మండల కేంద్రంనుంచి చంటిగారిపల్లెకు బైక్‌పై వెళుతుండగా ప్రధాన రహదారి మలుపు వద్ద కడప నుంచి బద్వేలు వైపు వెళుతున్న ఆర్టీసీ హైర్డ్ బస్సు ఢీకొంది. దీంతో తలకు, ఎడమకాలుకు బలమైన గాయాలు తగిలిన అతనిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక కడప జిల్లా

● ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హిందూ, ముస్లింలు కడప జిల్లాను మత సామరస్యానికి ప్రతీకగా నిలిపారని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. రంజాన్‌ను పురస్కరించుకుని స్థానిక ఉమేశ్‌చంద్ర స్మారక కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసుశాఖలోని ముస్లిం పోలీసు అధికారులు, సిబ్బందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఇఫ్తార్ విందును స్వీకరించారు. అమీన్‌పీర్ దర్గా ఇమాం ఇనయతుల్లా ప్రార్థన చేయించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఇఫ్తార్ విందు మత సామరస్యాన్ని చాటిందని, ఈ విందులో నగరంలోని ముస్లింలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారన్నారు. తాను గతంలో కడప డీఎస్పీగా ఉన్నప్పుడు వినాయక చవితి, బక్రీదు, ఉగాది, రంజాన్ పండుగల సమయంలో హిందూ ముస్లింలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఉగాది సందర్భంగా దేవునికడప ఆలయంలో ముస్లింలు పూజలు నిర్వహించడం, అమీన్‌పీర్ దర్గాను హిందువులు దర్శించుకోవడం మతసామరస్యానికి నిదర్శనమన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్ బాబు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య, నగరంలోని ముస్లిం ప్రముఖులు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ, టూటౌన్ సీఐ నాగార్జున, చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఆర్ఐలు వీరేశ్, శ్రీశైలరెడ్డి, శివరాముడు, చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, టూటౌన్ ఎస్ఐ ఎస్‌కేఎం హుసేఉన్, రిమ్స్ ఎస్ఐ జయరాముడు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, పోలీసు సిబ్బంది, నగరంలోని ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కడప: ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్



రాయచోటి: ఉగాది సందర్భంగా సిబ్బందికి భోజనాలు వడ్డిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు దంపతులు

రాయచోటిలో ఘనంగా ఉగాది సంబరాలు

రాయచోటిటౌన్ : ఆరు రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి అని, జీవితంలో కష్టసుఖాలు, కలిమిలేములకు ఇది ప్రతీక అని, ఈ ఉగాది పండుగ మీ జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆ కాంక్షించారు. ఆదివారం విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దంపతులు సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పోలీసు అధికారులకు, సిబ్బందికి ఉగా ది పచ్చడి, ప్రసాదం అందజేసి, భోజనాలు వడ్డించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి గ్రూప్ ఫొటో దిగి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో కొత్త కొత్త ఆశలతో ముందుకు వెళ్లాలని కోరుతూ జిల్లా ప్రజలకు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, పోలీసు అధికారులకు, పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూజారి పంచాంగం చదివి వినిపించారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

రంజాన్ పండుగను ముస్లింలు సంతృప్తి, సంతోషాలతో జరుపుకోవాలంటూ ఎస్పీ ఆకాంక్షించారు.. రంజాన్ సందర్భంగా సోమవారం సెలవు దినంగా ప్రకటించినందున ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, యం. పెద్దయ్య, రాయచోటి అర్బన్ సీఐ జీవీ చలపతి, ట్రాఫిక్ సీఐ ఎస్. విశ్వనాథ రెడ్డి, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు8 పాల్గొన్నారు.

జిల్లావాసులకు ఉగాది పురస్కారాలు

వేంపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులకు ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం విజయవాడలోని తుమ్మల కళా క్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉగాది పురస్కారాలతో సన్మానిం చారు. ఈ సందర్భంగా వేంపల్లె పట్టణానికి చెందిన ప్ర ముఖ కథా రచయిత వేంపల్లె షరీఫ్ ఉగాది పురస్కారం తోపాటు రూ.10వేల నగదు, జ్ఞాపిక అందుకున్నారు.

మైదుకూరు రూరల్ : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని మామిళ్లపల్లెకు చెందిన రైతు పందిటి కృష్ణమూరి నూతన పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడి సాధించారు. దీంతో ఆయనకు సీఎం శాలువా కప్పి, జ్ఞాపికతో పాటు రూ. 5 వేల నగదు బహుమతిని అందజేశారు.

బద్వేలు : బద్వేలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త హనుమంతరావుకు ఉగాది పురస్కారం తో పాటు పాటు శాలువ, తెలుగుతల్లి ప్రతిమ, పదివేల రూపాయలు నగదుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సాంస్కృతిక శాఖమంత్రి కందుల దుర్గేష్, సహస్రావధాని డాక్టర్ మాడుగులపణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఉగాది సంబరాలు



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

కడప కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):ఉగాది సందర్భంగా నగరంలోని శిల్పారామం లో సంప్రదాయ సాంస్కృతిక కళా వేదికపై పరిపాలనాధికారి కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో నగర సాయిరాం ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులు జానపద, సినీ గీతాలకు చేసిన నృత్యాలు కరతాళ ధ్వనులందుకున్నాయి. ఇదిలా వుండగా శిల్పారామం సందర్శించిన వారికి లండన్ బస్సు అందుబాటులో వుంది.

ఓగూరమ్మకు బోనాలు

పెనగలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈటమాపురం గ్రామంలోని గుంజనేటి మామిడి తోటలో వెలసిన పట్టపురాయి ఓగూరమ్మ గ్రామదేవతకు ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఇదే గ్రామం హరిజనవాడలోని గంగమ్మకు పొంగళ్లు నిర్వహించారు. కంబాలకుంట హరిజనవాడలో కొన్ని కుటుంబాల వారు గంగమ్మకు, పొందలూరు హరిజనవాడలో గ్రామదేవత గంగమ్మకు దళితులు పొంగళ్లు సమర్పించారు.



ఈటమాపురం రేణుకా ఎల్లమ్మకు బోనాలు తీసుకువెళుతున్న మహిళలు

ఘనంగా ఉప్పలపాటి గంగమ్మ జాతర

● మొక్కులు చెల్లించుకున్న గ్రామస్తులు

ఓబులవారిపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొర్లకుంట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఉప్పలపాటి గంగమ్మ, ఓబులవారిపల్లె గ్రామ పంచాయతిలో ఉన్న ఏకవీరమ్మ ఆలయంలో ఘనంగా జాతర నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు హాజరైన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన చెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



గంగమ్మతల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పరీక్ష తేదీలు ప్రకటించాలి

కమలాపురం రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ పరీక్షల తేదీలను ప్రకటించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కమలాపురంలో ఆదివారం ఆయన మాట్లాడారు.

అంగరంగ వైభవంగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, నరసింహారెడ్డి

పెండ్లిమర్రి,మార్చి 30 (ఆంధ్రజ్యోతి):నందిమండలం గ్రామంలోని పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన కొండగంగమ్మ తల్లి తిరునాళ్ల మూడో రోజు ఆదివారం అమ్మవారిని దర్శించుకునే భక్తులతో కిటకిట లాడింది.పూజారి ఇంటి వద్ద నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామస్తులు,పూజారులు ఆలయం వద్దకు పల్లకిలో ఊరేగింపుగా తీసుకొని వచ్చారు.ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం బండలాగుడు పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులను ప్రదానం చేసారు. దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. కోలాటం, చెక్క భజన నిర్వాహకులు ఏర్పాటు చేశారు. భక్తుల సమక్షంలో అమ్మవారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తెనాలి వేషధారణ,బాణసంచా పేలుల్లు ఆకట్టుకున్నాయి.అలాగే బండలాగుడు పోటీల్లో గెలుపు పొందిన ఎద్దుల యజమానులకు ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి,పుత్తా నరసింహారెడ్డి బహుమతులు అందజేశారు.

ఘనంగా ఉగాది సంబరాలు




గండి క్షేత్రంలో జరుగుతున్న గ్రామోత్సవ దృశ్యం, చెన్నూరులో ఉగాది సంబరాల్లో యువత

చెన్నూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా చెన్నూరులో పండుగ సంబరాలు మిన్నంటాయి. వీధివీధినా యువత రంగులు చల్లుకుంటూ కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికారు. తెల్లవారు జామున 4గంటల నుంచే రంగులు వెదజల్లుకుం టూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఒకరికొకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక సీతారామ నామ సంకీర్తన క్షేత్రం, ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయాల్లో పంచాంగ శ్రవణం గావించారు.

పెండ్లిమర్రి..: మండలంలో నూతన తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పండగ సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించు కున్నారు.వేకువ జామునే లేచి ఇంటిల్లి పాది నూతన వస్త్రాలు ధరించి పూజ కార్రక్రమలను ముగించుకుని దగ్గరలోని గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి బంధువులు,కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు.సోమవారం కొన్ని గ్రామాలలో కనుమ పండుగ నిర్వహించుకుంటారు.

కమలాపురం రూరల్..: ఉగాది పండుగను పురస్కరించుకుని పలు ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడిని అందరికీ పంచి పెట్టారు. నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన తెలుగు సంవత్సర ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే క్రిష్ణచైతన్య రెడ్డి పాల్గొన్నారు. తెలుగునెలల ఆధారంగా ప్రచురించిన క్యాలెండరు, డైరీని అందించారు. చదిపిరాళ్ల శివాలయంలో ప్రధాన అర్చకులు కేశవస్వామి పంచాంగాన్ని చదివి వినిపించారు.అలాగే నగర పంచాయతీ కమిషనరు పగడాల జగన్నాథం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి ప్రారంభిం చారు. కార్యక్రమంలో సాయి నరసింహారెడ్డి, నగర పంచాయతీ కమిషనరు జగన్నాథం, వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, మస్తానయ్య, మేరీ పాల్గొన్నారు.

వల్లూరు..: ఉగాది పండుగ రోజున పుష్పగిరి, పైడికాల్వలోని రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామంలో టీడీపీ నాయకులు తాడిగొట్ల రాఘవరెడ్డి 75 మంది ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా ధ్వర్యంలో ఆదివారం అందించారు అలాగే పైడికాల్వలో చెన్నకేశవఆలయంలో ఆలయ పెద్దపుత్త గ్రామంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, దాది రామయ్య, పుత్తా వెంకటసుబ్బారెడ్డి, పుత్తా బాలిరెడ్డి, నాగరాజు, ఈశ్వర్‌రెడ్డి వెంకట నారాయణ కార్యక్రమం లో పాల్గొన్నారు.

గండిలో వైభవంగా అంజన్న గ్రామోత్సవం

చక్రాయపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గండివీరాంజనేయస్వామి దేవస్థానంలో ఉగాది పర్వదినం సందర్భంగా అంజన్న గ్రామోత్సవం నిర్వహించారు. సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్ ఉత్సవ విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి గండి క్షేత్రం నుంచి సీతారామస్వామి ఆలయం, భూమానందాశ్రమం, వీరన్నగట్టుపల్లెలో పుర వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించి అనంతరం గండి క్షేత్రానికి చేరింది. అనంతరం రామ్మోహన్‌శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో గండి మాజీచైర్మన్ కల్లూరు వెంకటస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

సీకేదిన్నె..: చింతకొమ్మదిన్నె మండలంలో ఉగాది వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది సందర్భంగా ఆలయాలు, ఇండ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ ఉగాది అందరి జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా ఉగాది సంబరాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

వేంపల్లె..: వేంపల్లె పట్టణంలో ఉగాది పర్వదినం వేడుకగా జరుపు కొన్నారు. స్థానిక ఆలయాల్లో ఈ ఏడాది పంచాంగ శ్రవణాన్ని స్థానిక ప్రజలకు వివరించారు. బీజేపీ నాయకుడు గాలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ నిర్వహించారు. ప్రజలు ఆలయాల్లో ఈ సందర్భంగా పూజలు జరిపించారు.

ఉగాది పచ్చడి వితరణ

కడప ఎడ్యుకేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారి నూతన సంవత్సరం అయిన విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో కడప ఆర్టీసీ బస్టాండ్ (కొత్త బస్టాండ్) ఆవరణంలో ప్రయాణికులకు ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కొండారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి.సుబ్బరాయుడు,ఆర్టీసీ సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లలిత, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, మీడియా ఇన్‌చార్జి పగడాల బాలకష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం, ఉగాది వేడుకలు

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవం, ఉగాది వేడుకలను ఆదివారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మాసాపేట టీఎన్ఎస్ఎఫ్ కార్యాలయంలో జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, జిల్లా ఉపాధ్యక్షుడు లోకేష్, నగర అధ్యక్షుడు అనిల్, కడపజిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ విశ్వనాథ్, మాజీ నగర అధ్యక్షుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె సీఐగా నరసింహులు

వేంపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె సీఐగా పులివెందులలో పనిచేస్తున్న టి.నరసింహులు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సురేష్‌రెడ్డి కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు కర్నూలు రేంజి డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరగా బదిలీ అయిన ప్రాంతంలో వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

పండుగలు జాతి జీవనానికి కొలమానాలు

వేంపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పండుగలు జాతి జీవనానికి కొలమానాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా వేంపల్లెలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఉగాది పచ్చడిని పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, రమణ, వెంకటేష్, మహబూబ్ బాష, నాగరాజు, బద్రి, మదార్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ హత్యపై న్యాయవిచారణ జరిపించాలి

కమలాపురం రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):పాస్టర్ ప్రవీణ్ హత్యపై న్యాయ విచారణ జరిపించాలని పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్‌దత్తు తెలిపారు. ఆదివారం రాత్రి పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు స్థానిక చావిటికాడి నుంచి మూడురోజుల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

'మైనార్టీలు, దళితులకు రక్షణ కరువైంది'

కడప నాగరాజుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో మైనార్టీలు, క్రైస్తవులకు, దళితులకు రక్షణ కరువైందని దళితఫోరం నేత బూసిపాటి కిశోర్ ఆందోళన వ్యక్తం చేశారు. కడప నగరంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందితే పోస్టుమార్టం నిర్వహించే విషయంలోను పోలీసులు, ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఈ సమావేశంలో అఖిలభారత అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు పెంచలయ్య పాల్గొన్నారు.

పాలకుల సఖ్యతతో పురోగతి దిశగా రాష్ట్రం

కడప కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నాయకుల మధ్యగల సఖ్యతతో పురోగతి దిశగా రాష్ట్రం వడివడిగా పరుగులు పెడుతుందని శ్రీరాజరాజేశ్వరీదేవి దేవస్థానం ప్రధాన అర్చకుడు, జోతిష్యపండితుడు పిడతల గోపాలకృష్ణశర్మ వెల్లడించారు. విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం 6-30 గంటలకు నగర ఆకులవీధిలో గల రాజరాజేశ్వరీదేవి ఆలయంలో పంచాంగ శ్రవణం గావించారు. అంతేగాక నగరంలోని దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం, బాలాజీ దేవాలయం, హౌసింగ్‌బోర్డు కాలనీ,లలో పంచాంగ శ్రవణం చేశారు.

అయ్యవారురెడ్డికి ఘన సన్మానం



యోగా గురువు అయ్యవారురెడ్డిని సత్కరిస్తున్న ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి చెందిన యోగా గురువు పాలెంపల్లె అయ్యవారురెడ్డిని ఉగాది పురస్కరించుకొని ఆయన శిష్యులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అయ్యవారురెడ్డి మాట్లాడుతూ తాను గత 27 సంవత్సరాలుగా కడపలోని యాదాల రంగమ్మ బాలికోన్నత పాఠశాలలో ఉచితంగా మహిళలు, పురుషులు, యువకులకు యోగా శిక్షణ ఇస్తున్నానన్నారు. యోగా శారీరక మానకిస ఉల్లాసానికి దోహదపడుతుందన్నారు. పండ్లు, స్వీట్లు పంపణీ చేశారు.

విశ్వప్రగతి చిట్‌ఫండ్స్‌లో ఏజెంట్లకు సన్మానం



ఏజెంట్లను సన్మానిస్తున్న తుంగా రమణయ్య, తుంగా వెంకటేష్

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా విశ్వప్రగతి చిట్‌ఫండ్ సంస్థ ఆధ్వర్యంలో ఏజెంట్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ తుంగా రమణయ్య మాట్లాడుతూ ఈ కొత్త సంవత్సరంలో అందరికీ సుఖసంతోషాలు కలగాలని భగవంతుని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తుంగా వెంకటేష్, ఆకుతోట శంకరయ్య, వాసుదేవరెడ్డి, సంపత్‌కుమార్, కొండయ్య, చెంగయ్య, నరసింహులు, వీరప్రసాద్‌రెడ్డి, కానాల బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కట్టరా..?

- హైవే సర్వీసు రోడ్డు పక్కన కట్టని డ్రైనేజీ
- పదేళ్లుగా ఇబ్బంది పడుతున్న ఎస్సీ,ఎస్టీకాలనీవాసులు



చెన్నూరులో హైవే రహదారి పక్కన అరుంధతీనగర్ వద్ద మురుగుకాల్వ కట్టని దృశ్యం

చెన్నూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీఎస్టీ కాలనీల్లో మెరుగైన వసతులు కల్పించి వారి జీవనశైలి బాగుండేలా చేస్తామని పదే పదే చెప్పే అధికారులు క్షేత్రస్థాయికి వచ్చే సరికి వారిన్నీ ఊకదంపుడు మాటలేనని తేలుతోంది. పది రూపాయలు డబ్బులున్న వ్యక్తులు నివశించే ప్రాంతాల్లో అభివృద్ధి పనులు అక్కడే చేస్తున్నారే తప్ప హరిజన, గిరిజన కాలనీలంటే తీవ్ర నిర్లక్ష్యమని చాలా ఏళ్ల నుండి వినిపిస్తున్నా అవేమీ తమకు పట్టనట్లుగా వ్యవహరించే తీరు మండల కేంద్రమైన చెన్నూరులో అదీ హైవే రహదారిలో స్పష్టంగా తెలుస్తోంది. చెన్నూరు హైవే రహదారికి పడమటి వైపు ఓసీ, బీసీ కాలనీలు, తూర్పు వైపు ఎస్సీఎస్టీ కాలనీలున్నాయి. అయితే 2009లో చెన్నూరు మీదుగా హైవే రహదారి వెళ్లేటప్పు డు ఇంటిని, ఇంటిస్థలాలు తీసుకున్న హైవే అధికా రులు 2012లో రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేశా రు. కానీ అనేక ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు చేసిన ఫలితంతో సర్వీసు రోడ్లు ఏర్పడ్డాయి. కానీ మురుగునీరు వెళ్లేందుకు కాల్వలు మాత్రం ఏర్పాటు కాలేదు. కానీ బెస్తకాలనీ వైపు డ్రైనేజీ కట్టారు. అయితే తూర్పు వైపున్న ఎస్సీఎస్టీ కాలనీల వైపు మాత్రం ఎగ్గొట్టారు. ఇక్కడ అరుంధతీనగర్, సుగాలికాలనీ లున్నాయి. డ్రైనేజీ లేకపోవడంతో హైవే రోడ్డు ఎత్తుగా ఉంటుంది. దాని కింద సర్వీసు రోడ్డు కొంత ఎత్తుగా ఉంటుంది దాని కింద ఉన్న అరుంధతీనగర్, సుగాలి తాండ మాత్రం తగ్గులో ఉండి వర్షం కురిసినప్పుడల్లా ఈ కాలనీలు వర్షం నీటితో నిండిపోతాయి. రోజుల కొద్దీ నీరు నిలబడడం, ప్రజలు ఇబ్బందులు పడడం, ఇది కొన్నేళ్లుగా జరిగే తంతు. అయినా హైవే అధికారులు తమకు సంబంధంలేనట్లుగా వ్యవహరిస్తున్నారు.



కాల్వలో పేరుకుపోయిన ప్లాస్టిక్‌వ్యర్థాలు

మురుగుతో నిత్యం కంపే..: ఈ కాలనీలకు ముందు వైపును నుంచి ప్రవహించే మురుగునీటితో ఈ రెండు ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఆ కాలనీల్లో పగలు ఎప్పుడు చూసినా పందులు ,దుర్వాసనతో ఆ కాలనీవాసులు ఇబ్బందులు పడు తున్నారు. పగలంతా పందుల బెడద, చీకటి పడగానే ఈ కాలనీ చుట్టూ వ్యవసాయ పొలాలు న్నాయి కాబట్టి పాములబెడద,మురుగునీటినిల్వ వల్ల దోమల విహారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మైదుకూరు ఎడ్లకు మొదటి బహుమతి


బండలాగుతున్న మైదుకూరు ఎడ్లు

చాపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామంలో ఆదివారం అంకాళమ్మ తిరుణాళ్ల సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో మైదుకూరు ఎడ్లు మొదటి బహుమతి సాధించాయి. ఈ పోటీల్లో మైదుకూరుకు చెందిన వెంకటేష్‌యాదవ్ ఎద్దులు 1415 అడుగుల లాగి మొదటి బహుమతి రూ.లక్ష గెలుచుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు టౌన్ వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వార్శల గురివిరెడ్డి ఎద్దులు 1400 అడుగులు లాగి రెండవ బహుమతి రూ.80 వేలు, ప్రొద్దుటూరు మండలం రంగసాయిపురం గ్రామానికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు 1119 అడుగులు లాగి మూడో బహుమతి రూ.60 వేలు గెలుచుకున్నట్లు వారు పేర్కొన్నారు. కాగా అంకాళమ్మ తిరుణాళ్ల అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రొద్దుటూరు, మైదుకూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, కేసీకెనాల్ వైస్‌చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి, టీడీపీ నాయకులు, రామమోహన్, రామాంజనేయులు, మిల్లు శ్రీనివాసులు, వెంకటసుబ్బారెడ్డి, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రేషన్ బియ్యం పక్కదారి

- లారీలకు లారీలే తరలిస్తున్న వ్యాపారులు
- మిల్లులో పాలిష్ చేసి రవాణా
- నిఘా వైఫల్యమా...అధికారుల చోద్యమా...


లారీతో సహా పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్‌ఫొటో)

బద్వేలు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) పేదవాడికి పట్టెడు అన్నం కోసం ప్రవేశపెట్టి అమలు అవుతున్న రేషన్ బియ్యం పథకం పక్కదారి పడుతోంది. ఈ పథకంలోని బియ్యాన్ని సేకరించి పాలిష్ చేసి ప్రైవేటు మార్కెట్‌లో పెద్ద ఎత్తున వ్యాపారం సాగిస్తున్నారు. బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు కడప ప్రాంతాలలో ఎక్కువగా ఈ అక్రమ వ్యాపారం సాగుతోంది. ఇందులో బద్వేలు ప్రాంతంలో ఎవరెన్ని చెప్పినా ఫిర్యాదులు అందుతున్నా రేషన్ బియ్యం పక్కదారి పడుతూనే ఉంది. అదే వ్యాపారులకు రహదారిగా మారింది. బద్వేలు కేంద్రంగా ఇప్పుడు మైదుకూరుకు మించి సాగుతున్న ఈ దందాకు ప్రభుత్వ నిఘా పని చేయక పోవడమా లేక అధికారులు చోద్యం చూస్తున్నారా అన్న ఆరోపణలు తప్పడం లేదు.

రేషన్ పట్టు... పాలిష్ కొట్టు : నెల నెలా లబ్ధిదారులకు అందించే రేషన్ బియ్యాన్ని వ్యాపారులు వారి కూలీలు లేదా సొంత మనుషుల ద్వారా సేకరించడం ఒక మార్గం అయితే.. కొందరు రేషన్ పంపిణీ చేసే వారే లబ్ధిదారులకు రేషన్ బదులు డబ్బులు చెల్లించి వ్యాపారులకు విక్రయిస్తున్నారని సమాచారం. ఈ రెండు మార్గాల ద్వారా రేషన్ బియ్యం సేకరిస్తున్న వ్యాపారులు ఆ బియ్యాన్ని వారి గోడౌన్‌లలోకి చేర్చి పాలిష్ చేసి 26 కేజీల బస్తాలుగా నింపి వాటిని నేరుగాను కొన్ని బ్రాండ్ల పేరుతోనూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఆ రకంగా ఒక్కో లోడ్‌లో 600నుంచి 700 బస్తాలు పొరుగు ప్రాంతాలకు పొరుగు జిల్లాలకు తరలిస్తూ వ్యాపారం సాగిస్తున్నారు. కడపజిల్లాలో మైదుకూరు రేషన్ బియ్యం, అక్రమ వ్యాపారానికి పేరుగాంచింది. ఇప్పుడు అందుకు తామేమి తక్కువేం కాదంటూ బద్వేలు వ్యాపారాలు పోటీ పడుతున్నారు. వారు లబ్ధిదారులకు 12 నుంచి 15 రూపాయల వరకు ఒక్కో కేజీకి చెల్లించి బియ్యం సేకరించి పాలిష్ చేసి 26 కేజీల బస్తాను 1400రూపాయలు అంతకుమించి విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈబియ్యంలో కొన్ని నాణ్యమైన బియ్యం కల్తీ చేయడం ఆ మూటను ఈబియ్యాన్ని అమ్మి సొమ్ము చేసుకోవడం జరుగుతున్నట్లు సమాచారం.

నిఘా పెడితేనే: అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం అరికట్టాలంటే నిఘా ముమ్మరం చేసి స్థానిక రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. అప్పుడప్పుడు విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయడం, రేషన్ బియ్యం పట్టుకోవడం లాంటివి జరుగుతున్నా దందాపై స్థానిక అధికారులుబియ్యం వ్యాపారులతో కుమ్మక్కై చేతులు తడుపుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. బద్వేలు ప్రాంతం నుంచి లారీలకు లారీలు బియ్యం ప్రొద్దుటూరు, నెల్లూరు , బెంగుళూరు ప్రాంతాలకు తరలించడంతోపాటు జిల్లాలో కూడా బియ్యం రిటైల్ వ్యాపారులకు , అంగళ్లకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ రేషన్ దందాపై అధికారులు ఏ చర్యలు చేపడతారో చూడాలి.

బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

ఈ విషయంపై తహశీల్దారు ఉదయభాస్కర్ రాజును 'ఆంధ్రజ్యోతి'వివరణ కోరగా అక్రమ బియ్యం రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని, డీలర్లు ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు మా దృష్టికి తెస్తే చర్యలు చేపడతామన్నారు. సివిల్ సప్లై అధికారులు ప్రత్యేక దృష్టిసారించారని ఇటీవల కాలంలో అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యం రెండులారీలను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.



బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

బద్వేలు రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : విశ్వావసు నామ ఉగాది పర్వదిన సందర్భంగా బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్షుడు సాంబశివారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉగాది పర్వదినాన వేడుకలు నిర్వహిస్తూ భావితరాలకు పండుగల ప్రాముఖ్యతలను తెలియజేస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనరు వాకమల్ల నరసింహారెడ్డి మాట్లాడుతూ బద్దెన కళాపీఠం సేవాకార్యక్రమాలే కాకుండా సాహిత్య సేవలను కొనసాగించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ఆహుతులను ఆకట్టుకున్నాయి .ఈ కార్యక్రమంలో మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టరు శేఖర్‌రావు, జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం జీవీ సుబ్బారెడ్డి, కళాపీఠం కార్యదర్శులు శంభుప్రసాద్, చింతంరెడ్డి రామచంద్రరెడ్డి, సుధాకర్ తదితర కళాపీఠం సభ్యులు పాల్గొన్నారు.



వైభవంగా విశ్వావసు నామ ఉగాది వేడుకలు


చెన్నకేశవ, శ్రీదేవి భూదేవి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం

రాజుపాలెం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం వైభవంగా వేడుకలు నిర్వహించారు. ఉదయాన్నే భక్తిశ్రద్ధలతో ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి ఉగాది పచ్చడి తీసుకుని పంచాంగ శ్రవణం ఆలకించారు. అదే విధంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల దేవస్థానంలో ఉగాది పర్వదినం సందర్భంగా చెన్నకేశవ, శ్రీదేవి భూదేవి విగ్రహాల ప్రత్యేక అలంకరణ చేసి గ్రామ పురవీధుల్లో ఊరేగించి పండుగ జరుపుకున్నారు. శ్రావణ పంచాంగం వ్యవసాయ భూమిలో దిశలు తూర్పు నుంచి పడమరకు, పడమర నుంచి తూర్పునకు మళ్లీ పడమటికి రావడంతో ముందుగా పూజించుకున్న ట్రాక్టర్లు, ఎద్దుల ద్వారా పంట పొలాలకు వెళ్లి సేద్యాలు ప్రారంభించారు. ఈ సంవత్సరం ఎర్రగా పండే ధాన్యానికి మంచి దిగుబడులు వస్తాయని పంచాంగ శ్రవణంలో వేద పండితులు తెలిపినట్లు రైతులు తెలిపారు.

ఆసక్తిగా సాగిన పంచాంగ శ్రవణం


పంచాగ శ్రవణం చేస్తున్నసిద్ధాంతి పాల్గొన్న ప్రజలు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం ఆసక్తిగా సాగింది. పండుగ సందర్భంగా ఆదివారం అగస్త్యేశ్వరస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలతో అలంకరించారు. సాయంత్రం ఆలయ కాలక్షేప మండపంలో ప్రముఖ సిద్ధాంతి బీవీ రామకృష్ణయ్య పంచాంగశ్రవణం చేశారు. ఈ సంవత్సరం వర్షాలు సంవృద్ధిగా ఉంటాయని, పంటలు బాగా పండినా ధాన్యం ధరలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఎర్రని భూముల్లో పంటలు బాగా పండుతాయని వ్యాపారాలు అభివృద్ధి సాధించి విద్యార్థులు పురోగతి సాధిస్తారని తెలిపారు. ఉద్యోగులకు పదోన్నతులు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని పేర్కొన్నారు. పంచాంగశ్రవణం అనంతరం రమణయ్య భాగవతార్‌తో మయ్యూర ధ్వజం హరికథ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈవో రామచంద్రాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: ఉగాది సందర్భంగా స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు పంచాంగ శ్రవణం వినిపించారు. ఏ రాశి వారికి అనుకూలంగా ఉన్నాయి, ఏరాశి వారికి ఎలా ఉందో సవివరంగా వివరించారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల మహోత్సవం


గ్రామంలో ఊరేగింపుగా బిందె సేవ కార్యక్రమం

ముద్దనూరు మార్చి30(ఆంధ్రజ్యోతి): మండల పరిధి యామవరం గ్రామంలో ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా ఆదివారం జ్యోతులమహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అందులో భాగంగా సాయంత్రం గ్రామంలో బిందెసేవ నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు చేశారు.ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు జ్యోతుల ఉత్సవం నిర్వహించారు.

నూతన సచివాలయం ప్రారంభం

మైలవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేపరాల గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ఎంపీడీవో రామచంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీదేవిలు ఆదివారం ప్రారంభించారు. దాదాపు రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలు సచివాలయ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలకు ఉపాధి కల్పించడం లక్ష్యం

ప్రొద్దుటూరు , మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఉచిత కుట్టు శిక్షణతో పాటు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని కోటవీధిలోని కమ్యూనిటీ భవనంలో ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా చేతివృత్తులలో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలను అందిస్తున్నారన్నారు. మూడు నెలలు పాటు శిక్షణ ఇచ్చి శిక్షణ ముగిశాక సర్టిఫికేట్ తోపాటు ఉచితం గా కుట్టు మిషను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, బోగా కళ్యాణి ట్రైనింగ్ కోఆర్డినేటర్ కోటేశ్వర రావులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంటు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కాలజ్ఞాన కర్త శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రియశిష్యుడైన సిద్దయ్యస్వామి కుమారుడు పెద్దపీరయ్యస్వామి దేవస్థానం ప్రాంగణంలో రూ.30లక్షలతో చేపట్టిన వాటర్ ప్లాంటును ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రారంభించారు. దేవస్థానం ప్రాంగణంలో ప్రధాన కూడలి డిజిటల్ లైట్లు భక్తులకు సౌకర్యార్థం మరుగుదొడ్లను ప్రారంభించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ సిద్ధయ్యస్వామి దేవస్థానం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, కాణాల మల్లిఖార్జున రెడ్డి, సర్పంచ్‌లు మండలంలోని నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సాయం

పోరుమామిళ్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఎంపీటీసీ ముంతాజ్ భర్త మహబూబ్‌పీరా సహకారంతో ప్రెషర్ కుక్కర్‌లను అందించారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారు అందించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ ప్రతి సంవత్సరం పారిశుధ్య కార్మికులకు రంజాన్ మాసంలో మహబూబ్‌పీరా సాయమందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్, గిరి ప్రణీత్‌రెడ్డి, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఖాజీపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లూరు ఎస్సీ కాలనీలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి హాజరయ్యారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్ర భాస్కర్‌రెడ్డి, కొండపేట కేసీ కెనాల్ చైర్మన్ రవి, టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య, పుల్లయ్యనాయుడు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లప్రొద్దుటూరు లో పెద్దమ్మ దేవర

కొండాపురం. మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లప్రొద్దుటూరులో మంగళవారం పెద్దమ్మతల్లి దేవర నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఆ మేరకు సోమవారం రాత్రి నుంచి అమ్మవారికి పూజలు ఉంటాయన్నారు.

కనమర్లపూటి వర ప్రసాద్‌కు సన్మానం


ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న సునీల్‌కుమార్

బద్వేలు రూరల్ , మార్చి 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్, ఆర్యవైశ్య ప్రముఖుడు కనమర్లపూటి రామచంద్ర వరప్రసాద్ దంపతులను మార్కెట్ యార్డు మాజీ డైరెక్టరు మాలేపాటి సునీల్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయన స్వగృహంలో కలిసి స్వీట్లు, డ్రైఫ్రూట్స్ అందించి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు జిల్లాలో రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని అలాగే ఆయన మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి


గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అట్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గ్రామాల్లో ఎస్సీ ఎస్టీ దళిత కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చాంద్‌బాషా. రమణయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్.వెంకటాపురం, ముత్తుకూరు, తంబళ్లగొంది, దేవనగర్ గ్రామాల్లో ప్రజా చైతన్యయాత్ర కొన సాగించి గ్రామాల్లోని సమస్యలపై ప్రజలను అడిగి తెలు సుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కర్, ఏసు, సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

దువ్వూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో పెద్దమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వ హించారు. దాతలు పెద్దమ్మ గుడి వద్ద ఉగాది ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. గుడి పరిసరాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు విరివిగా పాల్గొని పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.









పాస్టర్ అనుమానాస్పద మృతిపై విచారణ చేపట్టాలి

కొండాపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్‌పగడాల అనుమానాస్పద మృతిపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని కొండాపురంలో ఆదివారం క్రైస్తవ, దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యం లో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని, క్రైస్తవులపై దాడులు ఆపాలని మానవహారం నిర్వహించారు. పాస్టర్లు దానం, మైకేల్, సామేల్, ప్రసాద్, సంఘాల నాయకలు అబ్రహాం, జోసఫ్, మనోహర్‌బాబు, వెంకటరమణ,గిరీష్ పాల్గొన్నారు.

పోరుమామిళలో: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని పోరుమామిళ్ల దళిత సంఘాల నాయకులు కోరారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. నిరసనలో బొజ్జ పుల్లయ్య, ముత్యాల ప్రసాద్, ఓబులాపురం శోబన్‌కుమార్, బండి ఓబులేసు, వీరయ్య రామసుబ్బయ్య పాల్గొన్నారు.

9 నుంచి పీరుగైబుసావలి ఉరుసు

జమ్మలమడుగు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని మెలవరంలో వెలసిన పీరుగైబుసావలి ఉరుసు ఏప్రిల్ 9నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆ మేరకు ఉరుసు మహోత్సవ పోస్టర్లను టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. జమ్మలమడుగు నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుటకు డిపో మేనేజర్ అంగీకరించినట్లు దర్గా కమిటీకి వారు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేయాలి

బద్వేలు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడు అన్వర్‌పై పోక్సో యాక్ట్ కేసు నమోదు చేయాలని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా డీఈవో, పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

